ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోండి
- గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్





గూడూరులో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్, దొరవారిసత్రం: నేలపట్టులోని పోలింగ్ బూత్‌ను సందర్శించిన ఆర్డీఓ

గూడూరురూరల్: 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా గూడూరు (ఎస్సీ) నియోజకవర్గానికి సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను పట్టణంలోని 29,30,31,32,45,46,47,48 పోలింగ్ బూత్‌ల వద్ద ప్రదర్శించారు. ఆర్డీఓ ఎం.కిరణ్ కుమార్ పరిశీలించారు. పారదర్శంగా ఓటరు జాబితా ఉండాలని సిబ్బందికి సూచించారు. బీఎల్‌ఓలు వెరిఫై చేసి ఓటరు వద్ద నుంచి క్లెయిమ్స్ తీసుకోవాలన్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డేలో ఓటర్ల నమోదు, మార్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఓటర్లు తమ పేర్లను చెక్ చేసుకుని అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బీఎల్‌ఓలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఉండాల్సిందే

నాయుడుపేటటౌన్: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆయా బీఎల్‌ఓలు కచ్చితంగా ఉండాలని తహసీల్దార్ రాజేంద్ర అన్నారు. మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆదివారం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలని ఆదేశించారు. కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు జాబితాలో సవరణలు చేసుకునేందుకు వచ్చే వారికి బీఎల్‌ఓలు సహకరించాలన్నారు. బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

సూళ్లూరుపేట రూరల్: ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూళ్లూరుపేట ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ చంద్రముని తెలిపారు. సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను (208,209,210,211 పోలింగ్ బూత్‌లు) ఆయన పరిశీలించారు. ఫారం 6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫారం 7 ద్వారా తొలగింపు, సవరణ, ఫారం 8 ద్వారా ఓటును ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి బదిలీ, నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్పు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 5వ తేదీ వరకు ఉంటుందన్నారు. డిసెంబర్ 2, 3వ తేదీల్లో మరోసారి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కన్నంబాకం రవికుమార్ ఉన్నారు.

శిబిరాల పరిశీలన

పెళ్లకూరు: ఓటరు నమోదు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ రామయ్య అన్నారు. మండలంలోని వివిధ పోలింగ్ బూత్‌లలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయి అధికారి పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

దొరవారిసత్రం: నెలబల్లి, మైలాంగం, నేలపట్టు గ్రామాల్లోని 158,159 పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ చంద్రముని తనిఖీ చేశారు. పోలింగ్ సమయంలో అన్ని వసతులు ఉన్నాయా లేదా అని స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

నాయుడుపేటటౌన్: కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని.. వారి వద్ద ఉన్న ఓటర్ల జాబితాను ప్రతి ఒక్కరూ పరిశీలన చేసుకోవాలన్నారు. పేర్లు లేనివారు అక్కడికక్కడే ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 2,3 తేదీల్లో కూడా ప్రత్యేక క్యాంపులు జరుగుతాయని తెలిపారు. తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5 తేదీ ప్రకటిస్తారని చెప్పారు.

సవరణలకు అవకాశం

చిల్లకూరు: మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు ఓటరు నమోదు శిబిరాలను తహసీల్దార్ పరిశీలించారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని సూచించారు. ఏవైనా మార్పులు ఉంటే బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు.



విన్నమాల పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్



పెళ్లకూరు: ఓటరు గుర్తింపు కార్డు అందిస్తున్న తహసీల్దార్



చిల్లకూరు: నమోదు ప్రక్రియపై ఆరా తీస్తున్న తహసీల్దార్

క్లుప్తంగా

నేడు కుల్లూరులో గడప గడపకు..

కలువాయి: మండలంలోని కుల్లూరు సచివాలయం పరిధిలో ఆదివారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న ఎంపీపీ

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన సజ్జ కృపకి శనివారం వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలను స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన సజ్జ వెంకటేశ్(38) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలు అందించారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి ఉన్నారు.

కండలేరులో 11.325 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.325 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోటూరుపాడులో భూ రీసర్వే పూర్తి



రైతులకు నోటీసులు అందిస్తున్న సర్వేయర్

రాపూరు: మండలంలోని కోటూరుపాడు గ్రామంలో భూ రీసర్వే పూర్తి అయినట్లు గ్రామ సర్వేయర్ కోటేశ్వరావు తెలిపారు. గ్రామంలో 698 ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. శనివారం రైతులకు 9(2) నోటీసులు అందించామన్నారు. రీ సర్వే సమయంలో హెచ్చుతగ్గులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకుంటే తిరిగి సర్వే చేసి సరిచేస్తామని రైతులకు నోటీసు ద్వారా తెలిపామన్నారు.

డ్రైనేజీ కాలువల్లో పూడిక తొలగింపు



జేసీబీతో డ్రైనేజీ కాలువలో పూడికతీత పనులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రధాన డ్రైనేజీ కాలువలో జేసీబీతో పూడికతీత పనులు చేపట్టారు. మురుగు మధ్యలో ఉండే పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగునీటితో పాటు వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలు కూడా డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయరాదని కోరారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కల్యాణి డ్యామ్‌కు 10 లక్షల చేపపిల్లల తరలింపు



జిల్లా మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఖాళీగా దర్శనమిస్తున్న చేపల తొట్టెలు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో నీటి సమస్య నెలకొంది. కార్యాలయం వద్ద నీటి తొట్టెల్లో చేపట్టిన 10 లక్షల చేపపిల్లల పెంపకం ప్రశ్నార్థకంగా మారింది. కొత్తగా వైర్లు, మోటార్లు బిగిస్తున్నా రెండు మూడు రోజుల వ్యవధిలోనే దొంగలు మాయం చేస్తున్నారు. దీంతో అధికారులకు ఆందోళన తప్పలేదు. ఈ నేపథ్యంలో 10 లక్షల చేప పిల్లలను శుక్రవారం కల్యాణి డ్యామ్ వద్ద ఉన్న పెంపక కేంద్రానికి తరలించారు. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ చేపల పెంపక కేంద్రం వద్ద తరచూ విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురవుతున్నాయని తెలిపారు. దీంతో తిరుపతి మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఉన్న చేపపిల్లలతోపాటు జాలర్లను కూడా కల్యాణి డ్యామ్‌కు తరలించామన్నారు. వర్షాలు వచ్చిన వెంటనే చేప పిల్లలను చెరువుల్లో వదులుతామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేతలు

పెళ్లకూరు: జీలపాటూరు గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రమణయ్య(58) కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పాలూరు మహేంద్రరెడ్డి పరామర్శించారు. రమణయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ప్రసాద్, పాండురంగయ్య, రాఘవయ్య, ప్రసాద్, రవి, రాజా ఉన్నారు.

నేడు గూడూరులో సీపీఎం బస్సు యాత్ర



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరురూరల్: సీపీఎం చేపడుతున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ కోరారు. శనివారం గూడూరు పాతబస్టాండ్, పోస్టాఫీసు, ట్రెజరీ, మండల పరిషత్ కార్యాలయం, గాంధీ మున్సిపల్ బిల్డింగ్, టెలిఫోన్ ఆఫీసు, ప్రధాన కూడళ్లలో ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం రేణిగుంటలో బస్సు యాత్ర ప్రారంభమై శ్రీకాళహస్తి మీదుగా గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్ చేరుకుంటుందన్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రమణయ్య, పట్టణ కార్యదర్శి సురేష్, చంద్రయ్య, మణి పాల్గొన్నారు.

వేడుకగా లక్ష్మీనరసింహుని పల్లకీ సేవ





ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు, ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వరగలికి చెందిన యరటపల్లి రంగనాయకమ్మ జ్ఞాపకార్థం తమ్మినపట్నం కోదండరామస్వామి ఆలయం మాజీ చైర్మన్ యరటపల్లి శరణ్‌కుమార్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకీపై ఉంచి ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ పర్యవేక్షించారు.

ముగిసిన ఆరాధన ఉత్సవాలు

ఓజిలి: మండలంలోని కర్రబల్లవోలు గ్రామంలో శ్రీవెంకటాంబ అమ్మవారి 23వ ఆరాధన ఉత్సవాలు శనివారం ముగిశాయి. మందిరంలో అమ్మవారికి ఉదయం అభిషేకాలు నిర్వహించి హారతులు పట్టారు. రెండు రోజులుగా ఆలయ పండితులు వేదమంత్రోశ్చరణల నడుమ అమ్మవారికి పలు రకాల పూజలు నిర్వహించారు. వివిధ రకాల అలంకరణలతో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి జీవితచరిత్రను పండితులు భక్తులకు తెలియజేశారు. ముగింపు వేడుకలకు హాజరైన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. గ్రామంలో రాత్రి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలను విజయవంతం చేసినందుకు భక్తులు, గ్రామస్తులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



వెంకటాంబ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం రాధ

సైదాపురం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అన్నారు. శనివారం సైదాపురం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయకురాలు పుష్పలత మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 6,669 మంది రైతులు అర్హులుగా గుర్తించామని చెప్పారు. సుమారు రూ.9 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. జగనన్న లేఅవుట్ల కింద మండలంలో 1005 గృహాలుండగా వాటిలో 800 పక్కా గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. వేగవంతంగా పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈనెల 10వ తేదీ కలెక్టర్ హరినారాయణ అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్ మాట్లాడుతూ.. ఊటుకూరు అంగన్‌వాడీ–2లో రెండేళ్లగా ఆయా విధులకు డుమ్మా కొడుతోందన్నారు. ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు చిత్తలూరు పోలయ్య, ఏఓ శివకుమార్, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, పాలూరు ఈశ్వరరాజు, ఎంపీటీసీ సభ్యులు సుమతి, పద్మమ్మ, నాగరాజు, ఉద్యానశాఖాధికారి ఆనంద్, ఏపీఎం రాధ పాల్గొన్నారు.



మండల మీట్‌లో ఎంపీడీఓ, ఎంపీపీ


ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్

గూడూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని కార్యక్రమం ద్వారా జనార్దన్‌రెడ్డి, రోహిణి దాతృత్వంతో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల జీవన ప్రమాణాలు పెంచేందుకు సీఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతి నెలా పౌష్టికాహారాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

గూడూరురూరల్: సీబీఎస్ఈ జాతీయ ఆర్చరీ పోటీలకు శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థులు కె.చరిత్, లోహిత్, 8వ తరగతి విద్యార్థులు సూర్యతేజ, కౌశిక్, అహ్మద్, చక్రీష్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో కోచ్ టి.శివశంకర్, విద్యార్థులను అభినందించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన సౌత్‌జోన్ సీబీఎస్ఈ ఆర్చరీ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగే సీబీఎస్ఈ జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నాయుడుపేటటౌన్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు ఈ నెల 11వ తేదీ హైదారాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గోవిందు వాసు కోరారు. పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో శనివారం ఇంటింటా వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

సంక్షేమం.. ప్రతి ఇంటా సంతోషం



తురిమెర్లలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ స్పందన

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తురిమెర్ల గ్రామ సచివాలయం పరిధిలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య తేడాను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని బుక్‌లెట్ ద్వారా అందించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. జగనన్న సురక్ష పథకం దేశంలోనే ఆదర్శవంతగా నిలుస్తోందన్నారు. 2024 ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. అమ్మ ఒడి పథకం ద్వారా ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు తల్లుల ఖాతాలో నగదు జమ చేశారన్నారు. ప్రతి పేదవాని ఇంట సంతోషం చూడాలన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక లోటులోనూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. ఏ గడపకు వెళ్లినా ఆనందంతో స్వాగతిస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలే కారణమన్నారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కరణం శ్రీనివాసులునాయుడు, తురిమెర్ల సర్పంచ్ అడసనపల్లి జయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కరణం రమణమ్మ, నేతలు ఏటూరి బుజ్జిరెడ్డి, మనోహర్, బట్టేపాటి దయాకర్‌రెడ్డి, ఆదిశేషయ్య, రామ్‌గోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, శశికుమార్ రెడ్డి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న రామ్‌కుమార్‌రెడ్డి

గడప గడపలో అపూర్వ స్పందన

జగనన్న పాలనలో ఆనందంగా దీపావళి జరుపుకుంటామని తురిమెర్ల గ్రామస్తులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వద్ద తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నవరత్నాలతో ఆర్థిక భరోసా లభిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది అవ్వా అంటూ గ్రామానికి చెందిన నెమళ్లపూడి అనంతయ్యను నేదురుమల్లి ప్రశ్నించారు. చాలా బాగుందని సమాధానం ఇచ్చారు. పథకాలు అందుతున్నాయా అవ్వా అంటూ గ్రామానికి చెందిన తిరుపతమ్మను ప్రశ్నించగా అందుతున్నాయని.. జగనన్న తమ జీవితాల్లో వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేసింది.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రసిద్ధ శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకం అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు. ఆలయ టీటీడీ అధికారి శ్రీనివాసులు, షరాబ్ ఉదయకుమార్, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.